## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 6: నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన దూళి నడ్పి గంగారాం (60) జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లోని పైప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. గంగారాం కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## తుజాల్‌పూర్‌కు చెందిన బాల్‌రాజ్‌గౌడ్..



బీబీపేట్, ఏప్రిల్ 6: కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి మృతిచెందిన ఘటన మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై ప్రభాకర్ ఇందుకు సంబంధించిన వివరాలు ఆదివారం వెల్లడించారు. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన కన్నా బాల్‌రాజ్‌గౌడ్ (54) కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి అధికమవడంతో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సికింద్రాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు సాయికృష్ణాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## ఇద్దరిపై కేసు నమోదు

లింగంపేట, ఏప్రిల్ 6: మండలంలోని జగదాంబతండా, సురాయిపల్లి తండాకు చెందిన ఇద్దరు గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు ఆదివారం తెలిపారు. మిషన్ భగీరథ నీటిని దుర్వినియోగం చేస్తున్నారని సంబంధిత శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో జగదాంబ తండాకు చెందిన పాత్‌లోత్ శ్రీను, సురాయిపల్లి తండాకు చెందిన రమావత్ సక్రుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## మహిళ అదృశ్యం

కామారెడ్డి, ఏప్రిల్ 6: కామారెడ్డి పట్టణం గొల్లవాడకు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లవాడకు చెందిన కొట్టూరి లక్ష్మీస్వరూప ఈనెల 5వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆమెకు కల్లు తాగే అలవాటు ఉన్నదని, మూడు రోజుల క్రితం చిన్న గొడవ జరగడంతో ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లినట్లు భావిస్తున్నట్లు భర్త అనుమానం వ్యక్తం చేశాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 86145, 8712666242 ఫోన్ నంబర్లలో, పట్టణ పోలీసుస్టేషన్‌లో వివరాలు తెలియజేయాలని సూచించారు.

## ఇంటి పన్ను సకాలంలో చెల్లించండి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: మున్సిపల్ పరిధిలోని ప్రజలు తమ ఇంటి పన్ను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నును ఈనెల 30వ తేదీలోపు చెల్లించి 5శాతం డిస్కౌంట్ పొందవచ్చని తెలిపారు. ఇంటి పన్ను కార్యాలయ పనివేళల్లో ఆఫీసులో, ఆన్‌లైన్‌లోనూ చెల్లించవచ్చని సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఇంటి యజమానులు ఐదు శాతం డిస్కౌంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్ కుమార్ సూచించారు.

## నేడు కమ్యూనిటీ మెడియేషన్ సెంటర్లు ప్రారంభం

కామారెడ్డి, ఏప్రిల్ 6: జిల్లాలో కమ్యూనిటీ మెడియేషన్ సెంటర్లను సోమవారం ప్రారంభించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 12 కమ్యూనిటీ మెడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, వీటిని సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి, తాత్కాలిక చీఫ్ జస్టిస్ పుల్ల కార్తీక్ వర్చువల్‌గా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జిల్లా పోలీసుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## మెంగారంలో కుస్తీ పోటీలు..

లింగంపేట, ఏప్రిల్ 6: మండలంలోని మెంగారం గ్రామంలో సోమవారం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద కుస్తీ పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐదువందల రూపాయలు, వెయ్యి రూపాయలు నగదుతో పాటు రెండు తులాల వెండి కడియం బహుకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.

## నాగిరెడ్డిపేట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 6: మండలంలోని తాండూర్, కిచ్చన్నపేట సింగిల్ విండో పరిధిలోని ఏడు గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని విండో అధ్యక్షుడు ఆకిడి గంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్, ఆత్మకూర్, జలాల్‌పూర్, రాఘవపల్లి, జప్తిజాన్కంపల్లి, బొల్లారం, మెల్లకుంట తండాల్లో కొనుగోలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

## ఎల్ ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, ఏప్రిల్ 6: ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల యజమానులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోపు రుసుము చెల్లిస్తే 25 శాతం రాయితీ అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్లాట్ల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్చి 31వ తేదీ వరకు ఉన్న గడువును ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు.

## టీజీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్




కామారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్

కామారెడ్డి, ఏప్రిల్ 6: టీజీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సాందీపని ఇంటర్ కాలేజీలో కోచింగ్ ఉంటుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు రూ.250 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9381692262, 9390628067, 63010 40952 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సమీర్, యోగేశ్, నరేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మార్మోగిన శ్రీరామ నామం

- వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణం
- తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయాలు



బాన్సువాడలోని ఉత్సవ మూర్తులు



గోపాల్‌పేటలోని కోదండరామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



బిచ్కుందలో స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 6 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆదివారం శ్రీ రామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలు, వాడవాడలా చలువ పందిర్లు వేసి సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణం అనంతరం కట్న కానుకలు సమర్పించారు. ఒడిబియ్యం పోశారు. పలు గ్రామాల్లో యువకులు డీజే చప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు స్థానిక మైనారిటీలు మజ్జిగ, రస్నా, తాగు నీటిని అందించి మత సామరస్యాన్ని చాటారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. బిచ్కుందలోని మింజర్ హనుమాన్ ఆలయం నుంచి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు ఊరేగింపుగా రామాలయం వరకు తీసుకువచ్చి, స్వామివారికి సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రను మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సతీమణి పుష్పతో కలిసి పాల్గొన్నారు. ఆయనవెంట పలువురు నాయకులు ఉన్నారు.



బిచ్కుందలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



బాన్సువాడలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 6: మండల కేంద్రం గోపాల్‌పేటలో ఇద్దరికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు సుధాకర్, ఇమామ్ ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కోంటూరు విజయలక్ష్మికి రూ.14,600, ఒడ్డె దుర్గవ్వకు రూ.12వేల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గులాం, ఇమామ్, ఫారుఖ్, మసూద్, అలీమొద్దీన్, అంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

మాచారెడ్డి,ఏప్రిల్ 6: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఆమె ఆదివారం ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో దుకాణాల యజమానులు రూ.లక్ష వ్యయంతో ఏడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఎస్సై అనిల్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధితుడికి పరామర్శ

లింగంపేట, ఏప్రిల్ 6: లింగంపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఆకుల సంగయ్యను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం పరామర్శించారు. సంగయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జాజాల.. బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయనవెంట బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోకల సాయిరాం, సహకార సంఘం డైరెక్టర్ గాండ్ల నర్సింహులు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నాయకులు బొల్లు శ్రీకాంత్, యూసుఫ్, చందు, నరేశ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



సంగయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

## అగ్నిపథ్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



క్రిష్ణను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: అగ్నిపథ్‌కు ఎంపికైన యువకుడిని స్థానిక నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని భిక్నూర్ గ్రామానికి చెందిన కుర్మ బాలప్ప కుమారుడు క్రిష్ణ అగ్నిపథ్‌కు మండల పరిధిలో ఎంపికయ్యాడు. అతడిని అభినందిస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, మత్తమాల ప్రశాంత్‌గౌడ్, చందు, మామిడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో దొంగతనం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

- మూడు తులాల పుస్తెల తాడు, రూ.20వేల నగదు అపహరణ

కామారెడ్డి, ఏప్రిల్ 6: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల నడిపి సాయిలు తన భార్యతో కలిసి ఈనెల 5వ తేదీన తన ఇంటికి తాళం వేసి కొడుకు ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో తన ఇంటికి వచ్చి చూశాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశాడు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అదే గ్రామానికి చెందిన భువనగిరి రాజు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డుపై యువకుల న్యూసెన్స్ : కేసు నమోదు



యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారిపై గండిమాసానిపేట్ గ్రామ మలుపు వద్ద రోడ్డుపై శనివారం రాత్రి న్యూసెన్స్ సృష్టించిన యువకులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా రోడ్డుపై బైక్ నిలిపి కేక్ కట్ చేసినట్లు చెప్పారు. రోడ్డుపై బైక్ నిలపడంతో పాటు వారంతా అక్కడ హంగామా సృష్టించడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగిందన్నారు. రోడ్డుపై పుట్టిన రోజు వేడుకలు చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై న్యూసెన్స్ కేసు నమోదు చేశామని, ఆదివారం సాయంత్రం యువకుల కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఎవరైనా రోడ్లపై పుట్టినరోజు వేడుకల పేరుతో న్యూసెన్స్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సలాబత్‌పూర్ ఆలయ అభివృద్ధికి 70 కోట్లు మంజూరు

మద్నూర్, ఏప్రిల్ 6: మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం 70 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేకపూజలు చేసిన ఆయన.. ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు సాయిపటేల్, ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, నాయకులు హన్మాండ్లుస్వామి, ప్రజ్ఞాకుమార్, శ్రీనుపటేల్, గంగాధర్, రమేశ్, పరమేశ్, గోపి, రాజు, అమూల్, దత్తు, రవి, బాలు, ఆలయ కమిటీ సభ్యులు కైలాస్, శ్రీనివాస్, నాగనాథ్, ఈవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


# భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, ఏప్రిల్ 6: భారతీయ కిసాన్ సంఘ్ మెంగారం గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ సీజీఆర్ఎస్ సభ్యుడు రాజాగౌడ్ ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా అన్నం సాయిలు, ఉపాధ్యక్షుడిగా పుట్ట దత్తు, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు, బాలసాయిలు, అనిల్‌గౌడ్, మల్లయ్య, నాగరాజు, రవికిరణ్, రాములు, కమ్మరి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు.



మెంగారం భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

## దోమకొండ కొట్టాళ్ల గడ్డ పద్మశాలీ సంఘం..



పద్మశాలీ పంఘం నూతన కార్యవర్గ సభ్యులు

బీబీపేట(దోమకొండ), ఏప్రిల్ 6: దోమకొండ మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం (కొట్టాళ్లగడ్డ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సబ్బని జగదీశ్, ఉపాధ్యక్షులుగా కన్న బాబు, నాగుల ప్రసాద్, గర్దాస్ సందీప్, నాగుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సన్నిధి యాదగిరి, కోశాధికారిగా ఎల్దొండ రవీందర్, సహాయ కార్యదర్శులుగా నాగుల దశరథం, నాగుల అనిల్, ప్రవీణ్, సాయిబాబాను ఎన్నుకున్నారు. సదరు పెద్ద మనిషిగా కన్న దామోదర్, ముఖ్య సలహాదారులుగా నాగుల రామచంద్రం, నాగుల భూమయ్య, సోమయ్య, బాల్‌నర్సయ్య, కమిటీ సభ్యులుగా భాస్కర్, ప్రసాద్, శేఖర్, సురేశ్, ప్రేమ్‌కుమార్, లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, వంశీ, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

## ఆదివాసీ నాయక్‌పోడ్ మండల కమిటీ..



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్తులు

నిజాంసాగర్, ఏప్రిల్ 6: ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్తుల మండల సమావేశాన్ని మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం మండల నూతన అధ్యక్షుడిగా కొమలంచ గ్రామానికి చెందిన తౌడగారి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా రవీందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలు, కోశాధికారి సాయిబాబా, ప్రధాన కార్యదర్శి వెంకట్, నాయకులు సాయిలు, భూమయ్య, నారాయణ, శివకుమార్, రాములు, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శబరిమాత ఆలయ రజతోత్సవ వేడుకలు

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 6: తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆలయ రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా శబరిమాత పాదుకుల పూజ, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



పూజ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

## వెదురు బొంగులు, తడకల షాపులో అగ్నిప్రమాదం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 6: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వర్ని చౌరస్తాలో ఉన్న డెకరేషన్, వెదురు బొంగులు, తడకల షాపులో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్, రెండో టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు చుట్టు పక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో వస్తువులన్నీ కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు షాపు నిర్వాహకులు బోరున విలపించారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఫిర్యాదు తీసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.